

# అరువు కిరీటాలు

ఇ. రామచంద్రం

క్రైన్ కథల పోటీలో
ప్రత్యేక సంచిక కోసం
ఎంపిక చేయబడిన కథ

"విశాఖపట్నం... ముప్పాలవానిపాలెం కాలనీలో ఒక సర్కిలు.

నాలుగు రోడ్లూ రద్దీగానే వున్నాయి. పేవ్‌మెంటు మీద – వేషంలో పేదరికం కనిపిస్తూ – అతను అతని బట్టలు నలిగీ, మాసిపోయీ... కాళ్లకున్న చెప్పులు చిరిగీ, శిథిలమౌతూనూ వున్నాయి. జింబో కమ్స్ టు టౌన్‌లో ... ఎప్పుడూ మనుషులనే ఎరగనట్లు... రోడ్డు మీది మనుషులనీ, అవతల ఏవో కొంపలు మునిగిపోతున్నట్లు వారి పరుగులనీ, ఉరకలు పెడుతూపోతున్న వాహనాలనీ, అవిచేస్తున్న ధ్వని కాలుష్యాన్ని – బిత్తరపోయి చూస్తూ– తనకేమీ పని లేనట్లూ, తనని తానే మరచిపోయినట్లూ వింతగా, విడ్డూరంగా కళ్లప్పగించి ఆశ్చర్యంతో బొమ్మలా నిలబడిపోయాడతను. అంతలో...

"తమ్ముడూ! బెదరూ...." అంటూ అతని భుజం మీద ఒక ముష్టివాడి చెయ్యి. అతను తుళ్లిపడి.... ఈ లోకంలోకి వొచ్చి... కంగారు పడిపోతూ.... "నా పేరా? .... అప్పారావ్...." అనేశాడు.

"అడక్కుండానే పేరు చెప్పావు. మంచోడివి. నిన్నెప్పుడూ – ఇక్కడ కానీ, సంఘంలో కాని చూసిన గుర్తు లేదే! ఈ సెంటరుకేనా, వెగ్గింగుకీ కొత్త మొహానివా?" అడిగాడు. "ఆ కొత్తోణ్ణే" అన్నాడు అప్పారావ్. కంగారు కొంచెం తగ్గి స్థిమితపడుతూ. అతను నిట్టూర్చి – "ఏమిటో! రోజు రోజుకీ ఈ వృత్తిలోకి కొత్తోళ్లు దిగబడిపోతున్నారు, ఇక్కడేదో బాగ్యమో బంగారమో దొరికేత్తాదన్నట్లు" అని మెల్లగానూ, "మరి అలా ఎర్రిచూపులు చూస్తూ ఎల్లి పోనిస్తావేం మనుసుల్ని? బెల్లం కొట్టిన రాయిలా నిలబడితే, నీ దగ్గర కొచ్చి ముస్టెయ్యడానికి నువ్వేమన్నా సినేమా యారో వనుకున్నావేటి? నువ్వు కుర్రాడివి కావె! ఆపాటి తెల్దూ? అమ్మా.... దరమం, అయ్యా దరమం... అంటూ అరుస్తూ... ఆళ్లెంట బడి అడుక్కో కష్టపడి అడుక్కుంటేనే కూడు దొరుకుద్ది. నీ ముష్టి మూటేదీ? అది కూడా లేదా? నీ వాలకం నాకేటీ అర్థం కావట్లేదు. పిచ్చాసుపత్రి నుంచి రాలేదు కద?" అని – తనమానాన పోయాడు. అప్పారావు ఊపిరి పీల్చుకున్నాడు. "అమ్మా! ఆకలి. అయ్యా ! ఆకలి..." అంటూ అరుస్తూ రెండడుగులు వేశాడు. అక్కడ.. 'ఏ వస్తువేనీ పది రూపాయలే..' పేవ్‌మెంటు దుకాణం. దానిలో అద్దాలు. వాటిలో మొహం చూసుకోవాలని పించింది. అలావాటులేని ఆపోశనం పట్టినట్లు అడుక్కోడం మరిచిపోయి... అద్దంలో తనకి తాను కనిపించేందుకు పేవ్‌మెంటు దిగేసరికి –

కారు హారన్ ! ... సంగీతంలా. తుళ్లిపడి చూశాడు. తనకి పక్కగా ఆగిందది. ఆ కారుని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. విశాఖపట్నం మొత్తానికి అలాటి కారు అదొక్కటేనేమో. అంత ఖరీదైనదిలా వుంది.

అంతగొప్ప కారు తన దగ్గరెందుకాగింది?

"ఎక్కు.." కారులోంచి బయటపెట్టిన తలలోని నోటిలోంచి ఆజ్ఞ! తనని కాదేమో అనుకున్నాడు. అంత గొప్పవాడికీ ఖరీదైన కారుకీ తనతో ఏం పని?

"త్వరగా.. నిన్నే... ఎక్కు.." గద్దింపు. ఆ కంఠస్వరంలో అధికారమూ, ఆజ్ఞా అప్పారావుని తక్షణమే కారులోకి గెంతేలా చేశాయి. అతని ప్రమేయం ఏమీ లేకుండానే.

అది చూసిన సీనియర్ ముష్టాడు ఆశ్చర్యపోయి - 'ఆ కారేటి? ఈ బికారేటి? అది ఆగి మరీ అప్పారావ్ నెక్కించుకోడమేటి? వీడు పుట్టు ముష్టోడు కాదా?పరిస్థితులవల్ల టెంపరవారీగా ముష్టోడయ్యాడా?' అనుకున్నాడు. అంతలోనే కారు మెత్తగా కదిలి - పరుగందుకుంది. కారులో... ఫ్రంట్ సీట్లో కూలబడ్డ అప్పారావ్- గుడ్లప్పగించి చూస్తే ఆ గొప్పవాడికి కోపమొస్తుందేమో అని భయపడుతున్నట్లు బెరుకుగా కళ్ళకొనలలోంచి చూశాడు. అతను డబ్బుతో పోత పోసినట్లున్నాడు కాని మామూలు మనిషిలా లేదు. ఆపాదమస్తకమూ దర్జాతోనూ దర్పంతోనూ మలిచి ఐశ్వర్యంతో పూత పూసినట్లున్నాడు. సిరి ఎక్కువైనా మనుషులు సహజంగా వుండరు కాబోలు. అంత గొప్పవాడు తనని తెలిసినట్లే కారాపి మరీ ఎక్కించుకున్నాడెందుకని? తనలాటి వాడితో అతనిలాటి ధనవంతుడి కేంపని? తనసెక్కడికి తీసుకెళ్తున్నాడు? ఏమీ మాట్లాడడేం? చెప్పడేం? ఇతను నిజంగా దొరేనా లేక దొంగ దొరా? ఈ రోజుల్లో ఎవరినీ నమ్మడానికి లేదు. ఘరానా దొంగలు గొప్ప వేషాలలో మనుషుల్ని మాయచేసి తీసుకుపోయి కిడ్నీల్లో ఏవో తీసేసుకుని తరువాత వాళ్ళని చంపిపారేస్తున్నారట. అదో పెద్ద వ్యాపారమట. మనుషుల్లో వుండే కుల, మత, పేద, గొప్ప, వంటి తేడాలు వాళ్ళ కిడ్నీల్లో వుండదా? తను అమాయకంగా అలాంటి ఉచ్చులో చిక్కుకోలేదు కదా? - అన్న అనుమానం రాగానే అప్పారావ్ వొణికి పోయాడు. "మీరెవరు? నన్నెక్కడికి తీసుకు పోతున్నారు? ఎందుకు?" బెదురుతూనే అడిగి తలవొంచేసుకున్నాడు. "రోడ్డు మీది మనిషివి. నీకు నేను చెప్పుకోవాలా? ప్రశ్నలు వెయ్యకు. పోనీ కదా అని చెబుతున్నాను. కొన్ని గంటలపాటు నువ్వు నాకు తైనాతీగా వుండి నేను చెప్పిన పనులు చేస్తావు. అందుకు తగిన దానికంటే ఎక్కువే ప్రతిఫలం పొందుతావు. దట్సాల్." కసిరాడు కారువాడు.

అతను అలా దబాయించేసరికి అప్పారావుకి కోపమొచ్చింది. "ఏమిటతగాడి జులుం? తనేమైనా ఇతని నౌకరనుకున్నాడా? తన సంగతి తెలియదు. తనకి కాని చిర్రెక్కితే ఇప్పుడే ఇలాగే కారు దిగిపోతాడు. ఆఁ..." అనుకున్నాడు మనసులో.

"నాకు తెలవకడుగుతాను, సారూ! మీరు మీకారు ఇంత డబ్బున్నవారు, ఖరీదైన వారూ కదా డ్రైవరును పెట్టుకోకుండా మీరే తోలుతున్నారేం?" దెబ్బకొట్టాను - అని మనస్సులో నవ్వుకున్నాడు.

అతనొక్కసారి అప్పారావు మొహం లోకి చూశాడు. "నీ మొహం చూడగానే నాకు అనిపించింది.... "

"ఏమని?" కుతూహలంగా అడిగాడు.

"నువ్వు మామూలుగా అందరిలాంటి బెగ్గర్‌వి కావని, నీలో ఏదో ప్రత్యేకత వుందనీ. "ఒకసారి ఆగి, "నాకు డ్రైవరూ, సర్వెంటూ, అంతరంగికుడూ ఒక్కడే. వాడు సెలవు పెట్టాడు. కారుని వాడో, నేనో నడపాలి. అంతే. మూడో వాడు చెయ్యివెయ్యడం నాకిష్టముండదు - "

"ఔను, అది మంచిదే. భార్యనీ కారునీ బహుజాగ్రత్తగా చూసుకోవాలి. నన్ను- అప్పారావనండి... మిమ్మల్ని సార్ అనేదా? సాబ్ అనేదా?" అడిగాడు.

అతను ఏమీ అనలేదు. ఒక రెడీమేడ్ బట్టలషాపు ముందు కారాపి, పర్సులోంచి రెండు వందలు తీసి - "నాకు ఛాఫియర్‌గా వుండేవాడు వేసుకోదగిన డ్రస్ కొనుక్కొని అక్కడే వేసుకొని తొందరగా రా. యజమాని గౌరవమూ, విలువా కొంతవరకూ అతని అటెండెంట్ వేసుకునే దుస్తుల మీద కూడా ఆధారపడి వుంటాయి" అంటూ ఆనోట్లు రెండూయిచ్చాడు.

తీసుకుని, షాపులోకి నడుస్తూ - "కక్కుర్తి జమీందార్లా వున్నాడు. ఐదు వందలో, వెయ్యో లేనిదే ఈరోజుల్లో కాస్త మంచి జత ఎక్కడ వస్తుందీ? ఏదో సినిమాలో - "ఈ పావలా పట్టుకుపోయినువ్వూ మీ కుటుంబమూ పదిరోజులు పాటు విందు భోజనాలు చేయండి -" అన్న జోకు వేసిన వాడి బ్రదర్‌లా వున్నాడు ఇతను". రెండు వందలలో జత బట్టలు! పైగా గౌరవనీయమైనవి! - నవ్వుకున్నాడు.

కొత్త డ్రస్సులో - తనను తాను అద్దంలో చూసుకొని - "జీవితమెంత చిత్రమైనది! ఎంత త్వరగా మనిషి చేత ఎన్నెన్ని వేషాలు మార్పించగలదు!" అనుకుంటూనే బిల్లు చెల్లించి వచ్చి కారెక్కాడు. కారులో అతను చచ్చినట్లు తన కోసం ఎదురు చూస్తున్నాడు. చూడక?

కారు కదిలింది. నడుపుతూనే - సారూ - ఏదో పరీక్షిస్తున్నట్లు అప్పారావు ముఖం చూసి... సర్వెంట్‌ని మరోసారి చూడడం కూడా తన హోదాకి భంగం అన్నట్లు తల తిప్పేసుకున్నాడు. అదే క్షణంలో అప్పారావు అతన్ని అలాగే ఓసారి చూసి...అవిధేయత అనుకుంటాడేమోనని తలదించేసుకున్నాడు.

కారు- బీచ్ రోడ్డు పట్టింది. భీమిలి రోడ్... సముద్రతీరం, సముద్రమూ అందంగా కనిపిస్తున్నాయి. తెన్నేటి పార్కు. కారు ఆగింది. సారు దిగారు. అప్పారావు కారు దగ్గరే వుండిపోవడం చూసి - "నువ్వూ రా" అన్నారు.....

"కారుకి కాపలా? అసలే ఖరీదైందీ ..." "ఫర్వాలేదు లాక్‌చేస్తాం. అంతగా పోయే యోగముంటే ఎవరాపగలరు? ఏది శాశ్వతం?" ఆ వేదాంతానికి అప్పారావుకి ఒళ్లు మండింది. కష్టపడీ, చమటోడ్చీ సంపాదించింది కాక ఎవరి నెత్తో కొట్టి...లేదా....ఎత్తుకొచ్చిందై వుంటుంది. అందుకే వస్తువు పట్ల యిలా నిర్లక్ష్యం. "నేను లాక్ చేస్తాను -" కీ తీసుకొని లాక్ చేశాడు. సార్ ఆశ్చర్యంగా చూశారు. అది గమనించి - "నాకు డ్రైవింగ్ కొంచెం తెలుసు. జీవిత మన్నాక చాలా నేర్చుకోవలసి వుంటుంది కదా!"అన్నాడు.

సారు వెనుక నడిచి-వారికి ఎదురుగా కొంచెం ఎడంగా ఇసకలో కూర్చున్నాడు.

లేత నీలం రంగులో సముద్రం. జరీ అంచుల్లా కెరటాలు......చల్లగా గాలులు

సముద్రంలో - దూరంగా .... కొంగలు జపం చేస్తున్నట్లు....తెరచాపలు విప్పి నిలుచున్న పడవలు....ఆకాశంలో అందమైన రంగు రంగుల మేఘాలు......కొంచెం సేపయ్యేసరికి- "భార తీయత నిండా కల బొబ్బరగార్లు. హిందూ దేశంలో వేడి వేడిగా బొబ్బరగార్లు, కరకరలాడే కమ్మనిగార్లు" అంటూ ఇట్నుంచి భారతీయ బొబ్బొరగారెల వాడూ, 'ఐస్‌క్రీమ్, అందమైన ఐస్‌క్రీమ్, అమెరికన్ ఐస్‌క్రీమ్, వేడిదేశానికి తగిన చల్లని ఐస్‌క్రీమ్-" అంటూ ఐస్‌క్రీమ్‌వాడూ వచ్చారు. ఇద్దరు ఇచ్చారు. పేపర్ ప్లేట్లో బొబ్బరు గార్లూ...కప్‌తో ఐస్‌క్రీమూ పట్టుకుని అప్పారావు దూరంగా వెళ్ళబోతుంటే - "కూర్చో నాకు అలాంటి పట్టింపులు లేవు. మిగిలినవన్నీ పక్కన పెడితే మనం ప్రాథమికంగా .... మౌలికంగా... మనుషులం మనది ఒకటే జాతి... మానవజాతి. అందుచేత మొహమాట పడకుండా ఇక్కడే తిను." అన్నారు సారు. తినే కార్యక్రమం ఎక్కువసేపు పట్టలేదు. ఇదేం జమీందారు? దుంపల జమిందారులా బొబ్బర గార్ల టేస్టేమిటో- అనుకుంటున్నాడు అప్పారావు మనసులో.

"తినగా తినగా గారెలు చేదెక్కు తాయి-" అన్నారు సార్.

"తినగా తినగా ఐస్‌క్రీం అసహ్య మేసేస్తుంది. ఎంత తిన్నా .... ఎంత వున్నా.... మొహం మొత్తనిది ఒక డబ్బే ఏమో సారు! లేకపోతే కొందరు అంతంత డబ్బు ఎలా భరిస్తారు ఆనందంగా?"

"నువ్వు- చాలా చక్కని భాష మాట్లాడు తున్నావే!"

"సహవాస గుణం అయి వుంటుంది. ఆర్నెల్లు సహవాసం చేస్తే వారు వీరవుతారట!. భోజరాజుని చూసిన వాళ్ళకి కూడా కవిత్వం అబ్బినట్లు మీలాటివారితో వుండటం వల్ల నాకూ మంచి మాటలొస్తున్నాయేమో చిన్నప్పుడు కొంచెం చదువు, ఆపైన పెద్దవారితో మసలడం వల్ల నాకూ భాష వొచ్చుంటుంది".

"అంతే అంతే సరేకాని వారు వీరవడం నిజంగా జరిగేదే అంటావా?"

మెల్లగా అడిగారు సారు. "మీకు చెప్పేంటంత వాడినా? కానీ.... ఎవరేనా సరే... ఒకరు మరొకరు ఎలా కాగలరు? ఎవరు - వారే.. కాకపోతే! ఎవరిలాగో అవ్వాలని కలలు కనవచ్చు, కోరుకోవచ్చు, ఊహించు కోవచ్చు, నటించొచ్చు".

"అవును. అంతే. మరి... అప్పారావూ! నీ కలలూ, కోరికలూ, ఊహలూ ఏమిటో?"

"పేదవాళ్ళకి కలలూ, కోరికలూ ఉండవు సారూ!" అన్నాడతను సిగ్గుపడిపోతూ.

"అదేమ్మాట? కలలకి, కోరికలకి - బీదా, గొప్పా తేడా వుంటుందంటే నేనొప్పు కోను. వాటిలో కొంచెం తేడాలుండొచ్చు. ఎవరి కలలూ, కోరికలూ వారివి. నేను ఈ పాటికి కొంత అర్థమై వుండాలే..."

"ఏమిటీ?" అయోమయంగా చూశాడు అప్పారావు.

"మనుషులంతా ఒకటే.కులం, మతం, అంతస్థులు, ఐశ్వర్యం, అధికారం, గొప్ప తనం.... ఇలాంటివన్నీ మనుషులు తగిలించు కున్న....లేదా... వారికి తగులు కున్న... అరువు కిరీటాలే!"

"ఆశ్చర్యంగా... అభినందనగా... చూశాడు అప్పారావు" ఆయనవేపు. అరువు కిరీటాలు! ... ఆ మాట ప్రయోగం ... చిత్రం గానూ, అర్థవంతంగానూ వినిపించింది. అనిపించింది. "నేనెవరినో చెప్పగలవా? పైపైన కాదు ఖచ్చితంగా." ఆ ప్రశ్నకు నేపథ్య సంగీతం లా సాగరఘోష. అప్పారావు తెల్ల బోయాడు. "చెప్పలేను సార్. మీతో కలిసి అట్టే సేపవలేదు. మీరూ చెప్పలేదు!" "అలాగే నాకు నువ్వెవరవో తెలియదు, నువ్వు చెప్పిన మేరకు తప్ప." సిగరెట్ అంటించి - "ఈ ప్రపంచంలో ఎవరికి తెలి సిందేనా తక్కువే. మనుషులు ఎక్కువగా బతికేది నమ్మకాలలోను, భ్రమలలోనే అవి కూడా చాలా వరకు స్వంతం కావు. ఎవరో చెప్పగానో, ఎవరినో చూసో ఏర్పరచుకున్నవే. రోమన్‌లా ఏం చెబుతుందో తెలుసా?" సిగరెట్ గాఢంగా పీల్చాడు. "తెలియదు-" అన్లేదు అప్పారావు. అయినా అతనికి తెలియదని అనేసుకుని చెప్పసాగాడు. "మనిషికి - తల్లే ఖచ్చితం. తండ్రి - నమ్మకం మాత్రమే- అంటుంది. స్త్రీ ప్రసవించడం అనేది రుజువు దొరుకుతుంది కనుక తల్లి ఖచ్చితం. ఆ శిశువు తండ్రి ఎవరనేదానికి నిదర్శనం ఎలా దొరుకుతుంది? తండ్రే ఖచ్చితం కానప్పుడు కులమతాలకు కచ్చితం ఏమిటీ?

ఐశ్వర్యవంతుల ఇంట పుట్టిన వాడు ఐశ్వర్యవంతుడు. పేదవాడి గుడిసెలో పుడితే బీదవాడు. కానీ... విద్య, కళలు, ప్రతిభ... ఇలాంటివి ఎవరికి వారు స్వయంకృషితో సాధించుకోవలసినవి. కనుక- మనిషికి సమాజంలో స్థానమూ, విలువా - వాటి ప్రాతిపదికమీద నిర్ణయించబడితే న్యాయం గానూ వుంటుంది, బాగానూ వుంటుంది. "ఏమంటావ్? - అన్నట్లు" చూశారు.

"సార్! ... మీరు ... వేదాంతులా.... పండితులా .... తాత్వికులా?" నివ్వెరపోతూ అడిగాడు అప్పారావు. ఈయన అందరి ధనవంతుల లాటి వాడు కాదని ఏదో ప్రత్యేకం వుందని అతనిలో ధృవపడింది.

సముద్రం మీద చీకటి ఛలలు పరుచు కుంటున్నాయి. దూరంగా ఓడలమీద దీపాల తోరణాలు,నీటి మీద రంగవల్లికలు తీర్చినట్లు చీకటి- గాలిని మరింత చల్లబరు స్తూంది.

"సత్యానికి కొంత చేరువుగా చెప్పా లంటే - స్వాప్నికుణ్ణేమో. తాత్వికుడులాటి పదం తెలుసే నీకు!"

"పదాలదేముంది? రికార్డు చేస్తే టేప్ రికార్డరు భగవద్గీత పాడుతుంది. నీ సంగ తటుంచండి"

"అన్నట్లు - నా మాటలు వినడానికో, నీ మాటలు నాకు వినిపించడానికో కూడా నీకు ప్రతిఫలం ముడుతుంది- "

"చీకట్లో కనిపించలేదు కాని, ఆ మాటకి అవమానంతో అప్పారావు ముఖం ఎర్రబడి పోయింది. "నేను డబ్బు మనిషిని కాను సార్. మీరు నన్ను చాలా అవమానించారు, అలా అని ఐ కేన్ సిన్ ఫర్ యువర్ మనీ. నాకు కానీ చికాకెత్తిందో మీకు గుడ్‌బై కూడా చెప్పకుండా ఇలాగే లేచిపోగలను. నేను- మనిషిని సార్ -" కోపంగానూ, మందలిస్తున్నట్లూ అన్నాడు. సారు కంగారుగా.. అతను పోకుండా చెయ్యి

పట్టుకొని – "సారీ అఫ్రావ్...వెరీ సారీ. నిన్ను డబ్బుతో అవమా నించడం నా ఉద్దేశం కాదు. నా బాధ్యత నాకు తెలుసని చెప్పాలని మాత్రమే. ప్లీజ్... వెళ్లిపోకు ఎంత ఆత్మాభిమానం నీకు!" అని ప్రాధేయ పడ్డారు. "నువ్వు చాలా గొప్పవాడివి" "సరే వెళ్ళను లెండి మీరు చెప్పేది వింటాను. నాకూ మనుషులూ, మాటలూ కావాలి." జాలిపడుతున్నట్లు చూసి... "చెప్ప దగిన వాడిని కాను కాని, స్థలం మారితే బాగుంటుందేమో. చలిగా లేదూ మీకు?" అని అడిగాడు. నిజానికి చలివేస్తున్నది అతనికే. చీకట్లో.... కవిలా... కనిపించకుండా వినిపిస్తుంది సముద్రం. "నిజమే మెదడువాపు (ఎం.వి.పి.) కాలనీకి దూరంగా పోదాం. ఎక్కడికి వెళితే బాగుంటుంది" అంటూ లేచారు సారు. ఇద్దరూ కారుదగ్గరికి వచ్చారు. "ఏదేనా బీచ్ రిసార్ట్ అయితే బాగుంటుందేమో!" అనేసి ... నాలుక కరుచుకుని.... "పేదతట్టలు మోసేదానికి పూలబుట్టల గురించి ఏం తెలు స్తుంది?" అన్నాడు అప్పారావు తన తొందర పాటుకి తననే తిట్టుకుంటున్నట్లు.

సార్ ఒకసారతని ముఖంలోకి చూసి కారు స్టార్ట్ చేసాడు. సముద్రం పక్కనే రోడ్డు మీద కొన్ని నిమిషాల పరుగు అనంతరం కారు ఒక బీచ్ రిసార్ట్‌లోకి తిరిగింది.

"నీ స్నేహితులెవరో చెప్పు. నీ గురించి నేను చెపుతాను–" అన్నట్లు కారుని చూస్తూనే అది కలవారి గురించి అంచనా వేసేశారు కాబోలు. ఆ సాగరతీర విశ్రాంతి నిలయం వారు – "వెల్‌కం సర్," అంటూ ఎదురొచ్చి స్వాగతం పలికి – వాట్ కెన్ వియ్ డు టు ప్లీజ్ యు సర్!" అని వొంగి సలాంలు చేశారు. సారు తానే వీళ్ళకి చెప్పెయ్యడం చూసి – సారు తమ హోదాని మరచి పోయినట్లు న్నారు అని నవ్వుకున్నాడు అప్పారావు మనసులో సువిశాల మైన ఆవరణలో ... సముద్రా నికి ఎదురుగా ఆ రిసార్ట్. కర్రలు, మాకులతో కట్టబడి రెల్లుగడ్డితో నేయబడి సహజత్వానికి దగ్గరగా వున్న కుటీరాలు– దూరదూరంగా, ఒకదాని కొకటి కనబడకుండా చుట్టూ పూల మొక్కలూ, గడ్డీ. మధ్య కర్రదుక్కల ఆసనాలు. అలాటి కాటేజీలోకి ప్రవేశించారు ఇద్దరూ. కుటీరంలో అడుగుపెట్టగానే అతిథుల హాలు. దానిలో సోఫాలూ, కుర్చీలు, టీపాయ్... ఒక మూల రిఫ్రిజిరేటర్. హాలులోంచి ద్వారాలు, వాటి వెనుక బెడ్‌రూంలు. ప్రతీదీ కళాత్మకమే. అందంగా...సదుపాయంగా....సుఖంగా వుంది కుటీరం. అక్కడ విద్యుత్ కాంతి కూడా వెన్నెల వెలుగులాగే సహజత్వానికి దగ్గరగా వుంది.

వాళ్ళిద్దరూ స్నానాలు కానిచ్చి వచ్చారు. అప్పారావు తన సంచిని లోపల ఒక మూల దాచేశాడు. "రాయల్ శాల్యూట్... జీడిపప్పు ఫ్రై... కబాబులు చెప్పు.." అన్నారు సార్. అప్పారావు ఇంటర్‌కంలో సర్వీసెస్‌కి ఆర్డర్ ఇచ్చాడు. అతను ఒక పక్కగా నేలమీద కూర్చోబోతుంటే –

"నో! అప్రావ్! నువ్వు నా ఎదురుగా కూర్చోవాలి. నాతో కలిసి డ్రింక్ చేయాలి" అన్నారు సార్. "వొద్దు సార్! అలా అయితే సాటెమ్మ సరికట్టుకుంటే ఊరమ్మ ఉరిపెట్టుకున్న ట్లుంటుందేమో...." అతనికి – స్నానం చేసినా మునపటి బట్టలే కట్టుకోడంతో కొంచెం చికాకుగా అనిపిస్తోంది.

"వుండదు. నేను ముందే చెప్పాను, మనం ఇద్దరం ఒకే జాతి వాళ్ళమని. మనం –సమానులం–" "కానీ ... డ్రింక్..." గొణిగాడు అప్పారావు. "మందు... డ్రింక్ తాగితే.... ఏం మాట్లాడేస్తామో..."

"అప్రావ్! ప్రపంచంలో దేనిలోనూ పూర్తి మంచీ వుండదు, చెడ్డా వుండదు. డ్రింకులో మంచేమిటంటే కొంత తాగాక మనిషి సంకోచాల నుంచీ, భయాల నుంచీ, విచారాల నుంచీ, విముక్తుడై స్వేచ్ఛ పొందుతాడు. తాను తానౌతాడు. ఆ స్థితి ఆరోగ్యానికి చాలా మంచిది. సమాధిలా అప్పుడప్పుడు ఆస్థితి పొందుతుంటే మనిషికి మహా మంచిది. ఈ స్థితి కోసం నేను ఎన్నాళ్ళుగా, ఎంతగా తపించానో! ఇవాళ నన్ను కాదనకు అప్రావ్! ప్రాణాలు తీసే విషాలను తప్ప – దేనినేనా జీవితంలో ఒకసారేనా రుచి చూడాలి. అదేమంచిది. మందు – నిజాలు పలికిస్తుందట –".

అతని మాటలలో కొన్ని అప్పారావుకి అర్థం కాలేదు. సీసాతో ద్రవం, ఉపద్రవం, సిగరెట్లు, తిండి సరంజామా తెచ్చి టీపాయ్‌మీద చక్కగా సర్దివెళ్ళాడు బాయ్. "ఫర్‌ద హెల్త్ ఆఫ్ అప్రావ్". అని ప్రపోజ్ చేసి .... "ఛీర్స్" చెబుతూ గ్లాస్ గాలిలోకి ఎత్తాడు సార్. చుక్క కూడా తాగకుండానే సార్‌కి కిక్కొచ్చిందే! – అను కుంటూ తను కూడా గ్లాసెత్తి ఛీర్స్ చెప్పాడు అప్పారావు. ఇద్దరికిద్దరూ చాలా దీక్షగా, అట్టే మాట్లాడకుండా, వేగంగా డ్రింక్ సిప్‌లూ, సిగరెట్ పఫ్‌లూ తీసుకుంటూ మూడు రౌండులు పూర్తి చేశాక ఇద్దరిలోనూ మందు తన ప్రభావం చూపించసాగింది. వాళ్ళు మందు మనుషులు కాసాగారు. అప్పుడు – "మాట్లాడు అప్పారావ్! మాట్లాడు. నోరారా మాట్లాడు. నిన్ను తెచ్చు కున్నదే అందుకు. అన్నట్లు నా కథ నీకు చెప్పలేదు కదూ? చెబుతాను. ముందు నువ్వు మాట్లాడు. నువ్వు నా గెస్టువి. గెస్టుని ఫస్ట్‌తో గౌరవించాలి. మాట్లాడు." అన్నాడు సిగరెట్ అంటించి. ఇప్పుడు అప్పారావుకి అతను సార్‌లా అనిపించడంలేదు. సమానుడిలా కనిపిస్తున్నాడు, మందు మహాత్యంలో. "ఏం మాట్లాడేది? జీవితం చాలా చిత్రమైంది" అనేశాడు గబగబా ఆ పీడ వదుల్చు కుందామన్నట్లు.

"స్టేట్‌మెంట్ కాస్ట్‌లీదే కాని ఒరిజినల్‌ది కాదు. సరే ఏది దాన్ని నిరూపించు చూద్దాం. "డ్రింక్ సిప్ చేస్తూ... సవాలు విసురుతున్నట్లే అన్నారు సారు. అది అతన్ని బాగా కుదిపి నట్లుంది.

మందుమీద..మధ్యస్థితి (మామూలు కీ మత్తుకీ మధ్యలో) వున్న అతను – అంత వరకు ప్రదర్శిస్తున్న వినయాన్ని వదిలి– వచ్చిన అవకాశాన్ని చటుక్కున అందుకున్నాడు.

మామూలుగానే మనిషంటే మాటలు– తాగితే మరీమాటలు.

అతను గ్లాసు కాళీచేసి... సిగరెట్ అంటించి.... సోఫాలో వెనక్కువాలి... "నేను పుట్టడం నోట్లో వెండి చెంచాతోకాదు. వజ్రాల చెంచాతోనే... ఇంకా విలువైన చెంచాతోనో. బంగారం, వైఢూర్యాలు, మణులు, మణాక్యాలు, రత్నాల గోలీకాయలతో ఆడుకుంటూ పెరిగాను. పారిశ్రామిక వేత్తనయ్యాను. ఎంతో ధనం

సంపాదించసాగాను. ఉహూ. నేను సంపాదించ నక్కర్లేదు. ప్రేమ ప్రేమను ప్రేమిస్తుందట. అదేమో కాని – డబ్బు డబ్బుని ఆకర్షిస్తుంది. నీ దగ్గరకు డబ్బే వచ్చి పడసాగింది.

ఒద్దంటే డబ్బు. వరదలా డబ్బు. నమ్మగలిగితే... నాకు అసహ్యమేసేంత అపరిమితంగా డబ్బు. నా లోపల, లోలోపల,.. ఇంకా లోపల..... నాకు డబ్బంటే అసహ్యం.... ద్వేషం...కసి.. " మాటల పులే! – అనుకుంటూ అడిగారు సార్– "ఎందుకని?"

"డబ్బుకి కూడా మార్జినల్ యుటిలిటీ థీరీ వర్తిస్తుందని, నా వ్యక్తిగతాభిప్రాయం. అతి సర్వత్రవర్జయేత్ అని పూరికే అనలేదు పెద్దలు. ఆఖరికి–అవధులు మీరిన మంచి కూడా అనర్థమే.

అతి మంచితనం పనికిరాదంటారు. అతి డబ్బు...అదే ... మితిమీరిన ఐశ్వర్యం నాలో పిశాచాలను పిశాచాల్లాంటి ఆలోచనలని.... అనుమానాలని–'' అప్పారావ్ రెచ్చిపోతుంటే సార్‌కి తమాషాగావుంది. ఏం కథ చెబుతున్నాడూ!– అనుకున్నాడు మనసులో. అప్పారావ్ మళ్ళీ చెప్పసాగాడు.

"రెండేళ్ళ క్రిందట నేనొక అఖిలభారత పారిశ్రామిక వేత్తల రెండు రోజుల సమావేశానికి వెళ్ళవలసి వచ్చింది. అదిగో ... అక్కడే .... అంతవరకూ పేడలో పురుగులా, నూతిలో కప్పలా, ఐశ్వర్యంలో బతికేస్తున్న నన్ను కుదిపి ... జీవితపు అట్టడుగు నుంచీ అల్లకల్లోలం చేసి..నా కళ్ళూ ఆలోచనలూ దృక్పథం తెరిపించిన సంఘటన జరిగింది–" డ్రింక్ సిప్ కోసం ఆగాడు.

"సార్ అతని గ్లాసులో డ్రింక్ పోసి అందించాడు. థ్యాంక్స్ చెప్పి – "సమావేశం ఏర్పాటు చేసిన వారు ఆ రాత్రి నాకు కలకత్తాలోని అతి ఖరీదైన హోటల్లో బస ఏర్పాటు చేశారు. ఆతిథ్యంలో భాగంగా .... ఆ రాత్రి .. నా గదిలోకి ... "కంపెనీ" గా ఒక ఎక్స్‌లెంట్ ఎయిటీన్ వచ్చింది–" సార్ ఆశ్చర్యపోయారు. అప్పారావ్ మంచి ఇంగ్లీషు మాట్లాడుతున్నాడే!

"ఆ చిన్నది నాకు డ్రింక్ ఫిక్స్ చేసింది. తను కంపెనీ యిస్తూ, తాగుతూ, తియ్యని మాటలు చెబుతూ, నాకు సిగరెట్ అంటిస్తూ ...సరదాగా వుంది. కొంతసేపు. అప్పుడు– ఆ శృంగారపుష్పం గుండెల మీద గుడ్డ తీసేసి మన్మథ చిన్నెలు వేయబోయింది.

"పాపా!"మందలింపుగా.. అరుస్తున్నట్లే పిలిచాను. ఆమె చెదరలేదు, బెదరలేదు. "యు లవ్ ద నేమ్? ఓ.కె. వాటే సిన్ నేమ్, వెన్ ద బెడ్డీస్ సేమ్?"నవ్వుతూ కౌగిలించుకోబోయింది. "స్టాప్ దేర్!" ఈసారి స్పష్టంగానే కోపం ప్రకటించాను.

"వై? వాటీస్ రాంగ్ వి...దు?" ఆశ్చర్యంగా చూసింది.

"రాంగీజ్ విడ్యూ. నేను కంటికి ఎలా కనిపిస్తున్నాను?"

"యంగ్... డైనమిక్... రొమాంటిక్... లవ్‌లీ... హేండ్‌సమ్... మూర్తీభవించిన మగతనంలా"

"అయితే – అది నీ దౌర్భాగ్యం. లేదా దృష్టి దోషం. ఒక రాత్రికి నీ రేటెంత?" బాధగా అడిగాను.

"అయిదు వేలు ప్లస్ టిప్. ఎందుకు? నా చార్జి ప్రీపెయిడే. టిప్ – మీ తృప్తి మేరకు".

ఆమెలో ఇంకా ఆశ చావనట్లుంది. మళ్ళీ నన్ను శృంగారానికి పురికొల్పబోయింది". ఈ ఖరీదైన.... విలువైన... సమయం వృథా చేయకండి. నేను హెచ్.ఐ.వి. నెగెటివ్ సర్టిఫికెట్ చూపించేదా?"

"అక్కర్లేదు. నీ టిప్పు మహాఅయితే ఒకటి రెండు వేలు. అంతే కదా?"

"అంతే" అందామె అయోమయంగా చూస్తూ. ఆమెకేమీ అర్థమవుతున్నట్లు లేదు.

"నువ్వు ఒకనిజంచెబితే పదివేలిస్తాను".

ఆమె నమ్మలేనట్లు చూసింది.

"పదివేలు టిప్! బాప్‌రే...ఆస్క్‌మి. యు గాటిట్ ష్యూర్..."

"వ్యాపార బుద్ధితో కాకుండా, ఆత్మ వంచన చేసుకోకుండా, మనస్ఫూర్తిగా, ఆత్మ సాక్షిగా నిజం చెప్పాలి. అలా చెబితే పదివేలు కాదు, ఎక్కువే ఇస్తాను."

"ప్రామిస్. భగవంతుడి సాక్షిగా నిజమే చెబుతాను". కళ్ళు మూసుకుని చేతులు జోడించింది. "పాపా! నా వయసు ఏభై నాలుగు. నా ఉద్దేశంలో, విశ్వాసంలో..నేను ముసిలాడిని. నీలాటిపిల్లలకి తాతలా మాత్రమే కనిపిస్తాను. నాకు నీ వయసు వారిని చూస్తూంటే వాత్సల్యం కలిగినట్టే. నీ వయసు వారికి నన్ను చూస్తే గౌరవమో, అభిమానమో ప్రేమో కలగాలి తప్ప కామభావన కలగదనే నా నమ్మకం. మరి నేను నీకు "రొమాంటిక్‌గా....మగసిరిలా... కనిపించావన్నావు. ఇది నిజమేనా?".

ఆ ప్రశ్న.. మెత్తగానే... ఆమె హృదయాన్ని మహాబాధ పెట్టి వుంటుంది. మూసుకున్న ఆమె కళ్ల రెప్పల సందులలోంచి – నీళ్లు. గుండెలమీద గుడ్డ కప్పేసుకుంది. కళ్లు తెరవకుండానే, ఒక నిముషం పోయాక – "మొట్టమొదటి చూపుకి మీరు నాకు గ్రాండ్ పా లాగే కనిపించారు. కాని... నేను వొచ్చింది వృత్తిరీత్యా. దీనిలో వ్యాపారానికే తప్ప సెంటిమెంట్లకి స్థానం వుండదు.వుండకూడదు. అందుచేత...ఆ నటనా మాటలు"అంది భారంగా."యంగ్... రొమాంటిక్.. హాండ్ సమ్...లాటివి మా ప్రొఫెషన్‌లో పడికట్టు పదాలు తప్ప మనసు లోంచి వొచ్చే మాటలు కావవి" ఏడుస్తూ అందామె.

"డబ్బుకోసం – ఆత్మని చంపుకునేంతగా దిగజారతావా!"

"ఆత్మ కంటే ఆకలి అతి బలమైంది. మనస్సాక్షిగా–... మీరు ... నాకు మొదట తాత లాగే అనిపించారు"

"ఇదైనా నిజమేనా? లేక ఇదీ డబ్బు కోసం ఆడే అబద్ధమేనా?" తొందరపాటులో నేనెంత క్రూరంగా వేశానో ఆప్రశ్న! ఆమె తక్షణమే రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుని ఏడుస్తూ వెళ్ళిపోయింది. ఇక నాకు నిద్ర పట్టలేదు. నామీద నాకే జాలివేయసాగింది. మరికొంచెం తాగి అద్దంముందు నిలుచున్నాను. డబ్బు ఎంత పాపిష్టిది! ఎంత వంచకి!

తాతని – తరుణ వయస్కుడిగా తలపింప చేయగలదు. మనసులో లేని ప్రేమను ముఖంలో చూబింపజేయగలదు. అంతరంగంలో లేని అభిమానురాగాలని అద్దం పట్టి చూపగలదు. నాకు లభిస్తున్న గౌరవం... అభిమానం...అనురాగం..వీటన్నిటిలో నిజమెంత?

డబ్బెంత? నేను - మైనస్ డబ్బు ఏమిటి? అద్దంముందు - డబ్బుని వదిలేసి నగ్న మౌదా మని ప్రయత్నించాను. అసలు సిసలైన నేను ...ఒంటి మీద డబ్బు పోగేదీ లేకుండా... నిఖార్సయిన నేను....ని చూసుకుందామని నా ప్రయత్నం.

నా భార్య ప్రేమిస్తున్నది - నన్నా, నా డబ్బునా?-ఏ కారణం వల్లనైనా నేను నిర్ధనుడినై వీధిన పడితే నాతో వుంటుందా? తన మానాన పోతుందా నన్నొదిలి? - వాల్మీకి కథలోలా.

డాడీ డాడీ అంటూ ప్రేమాభిమానాలూ, వినయ విధేయతలూ ఒలక బోస్తున్న కొడుకులూ, కూతుళ్ళూ రేపొక వేళ నేను పాపర్నై రోడ్డున పడితే- నన్ను డాడీ అంటారా, గాడిదా అంటారా?

నిజానికి మనిషికి ఇలాటి అనుమానాలు రాకూడదు. సెంటిమెంట్స్‌ని సందేహించకూడదు. కాని ... కళ్ళని మూసుకుందుకు రెప్పల్లా మెదడునీ, మనసుని మూసుకుందుకు దేముడేమీ ఇవ్వలేదుగా మనిషికి? ఏసీ లోంచి ఎండలోకి వస్తే మలమలా మాడిపోకుండా ఉండగలనా? కారులోంచి కాలినడకకి వొస్తే కదలగలుగుతానా? ధనవంతుడిగా కాక నిరుపేద నైతే బతకగలనా?

ఆ రాత్రి నుంచి నాలో ఆ ఆలోచనలు బుర్ర తినెయ్యసాగాయి. నా మెదడు దెయ్యాల కొంప అయ్యింది. నా ప్రవర్తనలో మార్పు చూసి ఇంట్లోవాళ్ళు నాకు వైద్యం చేయించసాగారు బలవంతంగా. మనసులోని బాధకి పైపై మందు లేమి పనిచేస్తాయి? ఒక్కసారి ... కనీసం ఒక రోజు ... పోనీ కొన్ని గంటలు... పారిశ్రామిక వేత్త అశోక్‌రావుగా కాక... అడ్రసు, ఐడెంటిటీ లేకుండా, పేదవాడిగా బతికి చూడాలని బలవత్తరమైన కోరిక". ఒక సారాగి, డ్రింక్ తీసుకుని, సిగరెట్ అంటించాడు.

"సారూ! ఆ అశోక్‌రావే ఈ అప్పారావు అనుకోండి. ఆ పారిశ్రామికవేత్తే ఈ బికారీ అనుకోండి. ఎక్స్‌లెంట్ మేకప్. స్టూడియోలో బికారీ వేషం వేయించుకువచ్చి మీకు సర్వెంట్‌గా దొరికాడనుకోండి. అప్పుడు... ఇంత కంటే చిత్రమేమైనా వుంటుందా? ఇలా జరగడానికి వీలులేకపోలేదు కదా?"

సారు తుళ్ళిపడి... అంతలోనే సర్దుకుని...నవ్వుతూ..."ఎందుకు లేదు? ఖచ్చితంగా వుంది అప్పారావు!...నేను జమీందారునో... ఇండస్ట్రియలిస్టునో... ధనవంతుణ్ణి కదా? ఇది మాత్రం నిజం అవ్వాలని ఏముంది? ఇది జీవితం ఆడిన తమాషాయే కావచ్చు. నీకు కథలాంటి బతుకు గురించి చెపుతాను. విను! "అంటూ డ్రింక్ తీసుకుని సిగరెట్ అంటించి మొదలు పెట్టాడు. "నేను ... ఏ ఆడ మగల తొందరపాటుకో పుట్టి ... వాళ్ళ పిరికి తనం వల్ల ఏ డస్టుబిన్‌లోనో పడేయబడి వుండగా ఒక అనాథ శరణాలయమో, ప్రేమసమాజమో పెంచి ఒక స్వచ్ఛంద సంస్థకు అప్పగించింది. ఐదారేళ్ళు వచ్చాక వాళ్ళ ధర్మమా అని కొంచెం చదువూ, బతుకు తెరువూ నేర్చుకున్నాను. పద్దెనిమిది నిండాక డ్రైవింగ్ లైసెన్స్‌తో నన్ను సంస్థ రక్షణ నుంచి ప్రపంచంలోకి పంపించేశారు. నా బతుకు నన్ను బ్రతకమని, డ్రైవింగే నా జీవన ఉపాధి అయింది. చదువు కొంచెమే అయినా, కొన్నదికాదు కనుక రకరకాల పుస్తకాలు, పత్రికలు, వార్తా పత్రికలు చదవటం పట్ల ఆసక్తి కలిగించింది. చదివినవి అర్థమూ అయ్యేవి. దీనితో నా బతుకేమిటో, పేదరిక మేమిటో అర్థం కాసాగింది. 'మనదీ ఒక బతుకేనా? సందులలో పందులవలె' అని శ్రీశ్రీ కరక్టుగా చెప్పాడు నాలాటివాళ్ళ గురించి - అనిపించేది. నేను అదీ యిదీ అనకుండా చేతికందిన ప్రతీదీ చదివేవాడిని కదా. కమ్యూనిస్టు సాహిత్యం, నక్సలిజం కరపత్రాలూ కూడా చదివాను. దానితో - నాలో అంతర్మథనం. 'కొందరు సీతాకోకచిలకల్లా విలాసంగా బతుకుతూంటే, నాలాటివాళ్ళు గొంగళి పురుగుల్లా ఎందుకు బతకవలసి వొస్తుంది? వాళ్ళు చేసిన పుణ్యమేమిటీ, నేను చేసిన పాపమేమిటి? యజమాని యజమాని ఎలా అయ్యాడు? అతనూ నేనూ మనుషులమే, మరి నేను అతని కారు నడుపుతూ అతని దయాధర్మ దాక్షిణ్యాల మీద ఎందుకు ఆధారపడాలి? అతను చెప్పిన అడ్డమాలిన పనులు ఎందుకు చెయ్యాలి నేను? నేను చెప్పినట్లు అతనెందుకు చేయడు? డ్రయివింగంటే - ఐతే విపరీతమైన వేగం. లేదా యాజమాని కోసం కారు దగ్గర నిరీక్షణ. ఆ నిరీక్షణలోనే చాలా చదివేవాడిని. పేద, కారు డ్రయివరునైన నన్ను సినిమాల్లోలా ఏ ధనవంతుల అమ్మాయీ ప్రేమించి పెళ్ళిచేసుకోలేదు. మా యజమానులు అన్నేళ్ళల్లోనూ పట్టుపట్టి నా ముఖం పరికించలేదు, తమ ఐశ్వర్యానికి పరువు తక్కువని కాబోలు. నేను-పేదరికపు న్యూనతా భావంకొద్దీ జంకుతో వారినీ సూటిగా చూడలేదు. దున్నేవాడిదే భూమి అనే నినాదం ఉందికాని తోలేవాడిదే కారు అనే నినాదమేనా వొస్తుందన్న ఆశ లేదు. నా దరిద్రం ఏనాటికీ తీరదని సుస్పష్టమై పోయింది. పేదరికం కుష్టు రోగంకంటే దుర్భరం. బాల్యం, బంధుత్వాలు. మమతలు, ఆపేక్షలు, అంతఃకరణలూ ఏవీ వుండవు దానికి. గతం, వర్తమానం, భవిష్యత్తు- ఏవీ వుండవు. అలాటి పేదరికపు బతుకు మీద అసహ్యం పుట్టింది. ధనవంతుల కార్లను కాల్చెయ్యాలని, భవనాలని కూల్చెయ్యాలనీ వికృతమూ, సంఘ విద్రోహకరములూ ఐన ఆలోచనలు మెదడులో నిండిపోసాగాయి. ఏ తీవ్రవాదినో నక్సలైటునో ఐపోతానేమో అని భయం పట్టుకుంది నాకు. అప్పుడు నేనొక నిశ్చయానికి వచ్చాను. కాకిలా కలకాలం బతకడం కంటే హంసలా ఆరునెలలు బతికినా చాలన్నట్లే. డ్రయివరుగా జీవితకాలం ఈడవడంకంటె. యజమానిలా ఒక్కరోజు... పోనీ.. కొన్ని గంటలు గడిపినా చాలనుకున్నాను. రాయల్‌గా ఒకరోజు జీవితం. అంతే నేను ఒంటరిని. పోయినా ఏడిచేవారెవరూ వుండరు, శవాన్ని ఈడ్చుకెళ్ళి తగలబెట్టవలసిన మునిసిపాలిటీవాళ్ళు తప్ప. ఒక ఏడాది పట్టింది పది వేలు పోగెయ్యడానికి. అందుకు ఎన్నో వెధవ పనులు చేశాను, అడ్వాన్సు తీసుకుని యజమానుల నుంచి గైర్‌హాజరవడం వరకూ. ఇవాళ నా రాయల్ డే. దీని కోసం మా యజమానికి చెప్పకుండా కారుని దొంగతనంగా తెచ్చాను. ఎక్సలెంట్ మేకప్ స్టూడియోలో జమీందారు వేషం వేయించుకున్నాను. మిమ్మల్ని ఫీఫియర్‌గా తీసుకున్నాను. తరువాత జరిగింది మీకు తెలిసిందే. అప్పారావ్, కార్ డ్రైవర్. అశోక్‌రావ్,

దిగ్రేట్ ఇండస్ట్రియలిస్టుగా నీ ముందు.. ఇప్పుడు..ఇక్కడ..... తాగుతూ... మాట్లాడు తూండడం - జీవితం చిత్రమైనది కాకపోతే సంభవమేనా?" చెప్పడం ముగించి గ్లాసుకోసం ముందుకి వొంగాడు సారు. సరిగ్గా అప్పుడు - యూనిఫామ్‌లో వచ్చాడు సర్కిలినస్పెక్టరాఫ్ పోలీస్.

"అశోక్‌రావ్‌గారి కారు దొంగిలించబడి ఇక్కడికి తీసుకురాబడింది. దొంగిలించినవాళ్ళు ఈ కాటేజి తీసుకున్నారని తెలిసి వొచ్చాను-" అన్నాడు సి.ఐ. చాలా మర్యాదగానూ, కొంత అధికారంగానూ, అప్పారావ్ నవ్వుతూ - "ఆ రిపోర్టిచ్చింది నేనే. కూర్చొండి. మాకు కంపెనీ ఇద్దరు గాని" అన్నాడు.

'నువ్వెవరివి'? బికారిలా ఉన్న అప్పా రావు వేపు నిరసనగా చూశాడు సి.ఐ.

"నిజానికి నేనే అశోకరావ్‌ని. కారు దొంగిలించి తెచ్చింది వీరు -"

"మందు బాగానే ఎక్కినట్లుంది"

"మందు కాదు ఇనస్పెక్టర్. అరువు కిరీటం కొంతసేపు పక్కన పెట్టి మనిషి నౌదా మని చేసిన ప్రయత్నం విచిత్రంగా బెడిసి కొట్టింది. నిజంగా నేను అశోక్‌రావ్‌నే వుండండి మీకు నా ఐడెంటిటీ నిరూపిస్తాను-" అని తన సంచీ ఉంచిన గదిలోకి వెళ్ళాడు.

"మీరెవరు సార్?"

"నేను - అశోక్‌రావు గారి డ్రయివర్ని".

"జమీందారులా.... గొప్పవారిలా వున్నారు! మరి అంత తాగడం ఎందుకు సార్?"

"లేదు. ఇది నిషా కాదు. నిజమే. మీరు చూస్తున్నది వేషం. నిజంగా నేను వారి డ్రయివర్నే వుండండి" అంటూ అతను రెండో గదిలోకి వెళ్ళాడు.

ఇనస్పెక్టర్ తలపట్టుకు కూర్చున్నాడు ఏమీ అర్థం కాక... ఆ గదుల ద్వారాల వేపే చూస్తూ. కొంచెం సేపట్లో... అప్పారావ్ వెళ్లిన గదిలోంచి అశోక్‌రావ్. జమీందారు వెళ్లిన గది లోంచి అప్పారావ్! పూర్తిగా అసలు రూపాలతో.

"సార్!" అంటూ కంగారుగా లేచి నిలబడ్డాడు సి.ఐ. నమస్కారం పెడుతూ.

అశోక్‌రావు నవ్వి - "చిన్న పొరపాటు తప్ప ఏమీ జరగలేదు. కంప్లయింటు సంగతి వొదిలేయండి వెళ్ళండి" అంటూ ఒక పెద్దనోటు అందించాడు. సి.ఐ. చాలా మొహమాటమూ, కొంచెం భయమూ పడుతూనే తీసుకుని... నమస్కరించి... గుడ్‌నైట్ చెప్పి వెళ్లిపోయాడు. అప్పుడు చూశాడాయన అప్పారావుని. "నువ్వా! ఇంత వరకూ బీచ్‌లో... జమీందారులా...."

"క్షమించండి సార్, మీరని తెలియక..." అంటూ అతను ఆయన పాదాల మీద పడిపోయాడు. "లే,లే - నేను మాత్రం నిన్ను తెలుసుకోగలిగానా? ఆ మేకప్ స్టూడియో నిజంగా ఎక్సలెంట్. ఇనస్పెక్టర్ పానకంలో పుడకలా వొచ్చి రసవత్తర మైన సన్నివేశం పాడుచేశాడు. దేనికైనా ప్రాప్తముండాలి. ఐశ్వర్యం పెరిగే కొద్దీ మనిషి మరింత బందీఔతాడు. "నిట్టూర్చాడు. "జరి గింది...నామాటలూ....ప్రవర్తనా..మరిచిపోండి సార్" ఏడిచినంత పనిచేశాడు అప్పారావు.

"నువ్వూను... ఏం?" నవ్వారాయన.

"అలాగే సర్".

కొన్ని నిముషాల్లోనే అశోక్‌రావ్ తన ఐశ్వర్యపు, హోదా కల అరువుకిరీటాన్ని తగి లించుకుంటూంటే, అప్పారావు తన అరువు - ఒక నాటి రాజు కిరీటాన్ని వొదిల్చేసుకున్నాడు. డ్రయివర్ ఐపోయాడు. ఆ అరువు కిరీటం తగుల్చుకుని.

ఈసారి కారుని అప్పారావు డ్రయివ్ చేయసాగాడు.

వెనకసీటులో కూర్చున్న అశోక్‌రావు - 'దరిద్రుడే కాదు, ధనవంతుడు తల కడగ బోయినా వడగళ్ల వాన పడొచ్చు'అనుకుంటుంటే, డ్రయివింగ్ సీటులోని అప్పారావు - 'దరిద్రుడికి జీవితంలో కొన్ని గంటలు కూడా రాయల్‌గా గడిపే అవకాశం దొరకనివ్వడం విధి' అను కున్నాడు.

సముద్రం - చీకట్లో... కనిపించ కుండా... ఘోషగా నవ్వుతూంది.

# హైకూలు

## పి. లక్ష్మణరావ్

కీటకం కాదు
సీతాకోక చిలుక
ఋతు విహంగం !

విజ్ఞాన జ్యోతి
ప్రకృతి నిఘంటువు
అర్థం చూసుకో !

నిటారు చెట్టు
గర్వం లేదని చిహ్నం
కొమ్మ రెమ్మలు !

కవి భావాలు
అక్షర కిరణాలు
సూర్య సమానం !

విజయం తథ్యం
దుఃఖ సంద్రంలోనైనా
కాలపరీక్ష

దోపిడీ తత్వం
దినదిన ప్రవృద్ధి
రాక్షసానందం !

భయం గుప్పిట్లో
జనసంద్రం ఇక్కట్లు
సునామీ పంజా !

ద్వేషాలే సాక్ష్యం
ఆనవాలు కోల్పోతూ
అనుబంధాలు !